

ఉచిత విద్య.. మిథ్యేనా?



- ప్రవేశాలపై కఠిన ఆంక్షలు
- కిలోమీటరు పరిధిలో ఉన్న వారికే ప్రాధాన్యత
- నిబంధనలు సవరించాలంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 28: ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు ప్రభుత్వం విధించిన నిబంధనలపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు. పాఠశాలకు కిలోమీటరు పరిధిలో గల వారి దరఖాస్తులు మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలన్న నిర్ణయాన్ని తప్పుబడుతున్నారు. కిలోమీటరు పరిధిలో తగినన్ని దరఖాస్తులు రాకపోతే అప్పుడు మూడు కిలోమీటర్ల పరిధిలో నివశిస్తున్న పిల్లల దరఖాస్తులు పరిగణనలోకి తీసుకుంటామనడం అన్యాయం అంటున్నారు. ఈ విధంగా అయితే సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్ బోధించేపాఠశాలల్లో సీట్లు పొందాలంటే శివారు ప్రాంతాల పిల్లలకు అవకాశం ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం 2009లో తీసుకువచ్చిన విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న బడుగు బలహీన వర్గాల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచితంగా 25 శాతం సీట్లు కేటాయించాల్సి ఉంటుంది. ఈ చట్టం కింద సీట్లు ఇచ్చేందుకు అన్ని ప్రైవేటు పాఠశాలలు రిజిష్టరు అయ్యాయి. ఇంత వరకు అయితే బాగానే ఉన్నా ఉచితంగా సీట్లు పొందేందుకు నిబంధనలు కఠినంగా రూపొందించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనంతగా ఆంధ్ర రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు గొప్పగా ఉన్నాయని పాలకులు చెబుతున్నా.. ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలను చేర్పించే తల్లిదండ్రుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉండటం గమనించదగ్గ విషయం. పేద వర్గాలకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలను మంచి ప్రైవేటు పాఠశాలల్లో చదివించాలని భావిస్తారు. ఈ క్రమంలోనే ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలన్న ప్రభుత్వ ప్రకటన రావడంతో ఎంతో సంతోషించారు. అయితే దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం కఠిన నిబంధనలు విధించడంతో వారి ఆశలపై నీళ్లు చల్లినట్లయింది.

రాష్ట్రంలోని విద్యార్థులంతా అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడాలని పదే పదే చెబుతున్నా పాలకులు ఐసీసీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్‌లో బోధనకు నిర్ణయించారు. అయితే చిన్న చిన్న ప్రైవేటు పాఠశాలలు కేంద్ర ప్రభుత్వం అమలు చేసే సిలబస్ బోధించడం లేదు. జాతీయ సిలబస్‌ను అమలు చేసుకోవాలని ప్రభుత్వం చెబుతున్నా ఇప్పటికీ మెజార్టీ ప్రైవేటు పాఠశాల్లో రాష్ట్ర సిలబస్‌లోనే బోధన సాగుతోంది. ప్రముఖ పాఠశాలల్లోని సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్‌లో బోధన అందుతుంది. ఆయా పాఠశాలల్లో ఉచితంగా ప్రవేశం పొందడానికి నిబంధనలు అవరోధంగా మారాయి. అందుకు పాఠశాలలకు కిలోమీటరు లేదా మూడు కిలోమీటర్ల పరిధిలో నివాసం ఉండాలని ప్రభుత్వం షరతు విధించింది. అది కూడా తొలుత కిలోమీటరు, ఆ తరువాత మూడు కి.మీ పరిధిలో ఉన్న పిల్లలకు సీట్లు కేటాయిస్తారు. అంతకంటే ఎక్కువ దూరంలో ఉన్నవారు ఆయా పాఠశాల్లో సీట్లు పొందేందుకు వీలు పడడం లేదు. ఈ నేపథ్యంలో పాఠశాలలకు 1, 3 కి.మీ పరిధిలో ఉండాలన్న నిబంధన రద్దు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రముఖ పాఠశాల్లో సీట్ల కోసం పోటీ పెరిగినా.. లాటరీ విధానం ఉంటుందని దాని వల్ల సమస్య ఉండదని భావిస్తున్నారు.

రేపు ప్రొద్దుటూరుకు చంద్రబాబు రాక

- మైదుకూరు పర్యటన రద్దు

కడప, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రజాగళం పేరిట రాష్ట్ర వ్యాప్తంగా పర్యటనలు చేస్తున్నారు. శనివారం ప్రొద్దుటూరులో శివాలయం సెంటరులో ఉదయం 10గంటలకు బహిరంగసభ జరగనుంది. తొలుత షెడ్యూలు మేరకు అదే రోజు ఉదయం మైదుకూరులో, మధ్యాహ్నం ప్రొద్దుటూరులో నిర్వహించాల్సి ఉంది. అయితే అనివార్య కారణాల వల్ల మైదుకూరు సభ రద్దు చేశారు. ఇక ప్రొద్దుటూరు సభ ఉదయం నిర్వహించనున్నారు. సీఎం జగన్ సిద్ధం సభ జరిగిన నాలుగవ రోజునే చంద్రబాబు సభ జరుగుతుండడంతో టీడీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.

చెంగల్‌పట్టు ఎక్స్‌ప్రెస్ పుదుచ్చేరి వరకు పొడిగింపు

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 28 : కాచిగూడ - చెంగల్‌పట్టు మధ్య నడుస్తున్న చెంగల్‌పట్టు ఎక్స్‌ప్రెస్‌ను పుదుచ్చేరి వరకు పొడిగించినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు జనార్ధన్ తెలిపారు. వారంలో మూడురోజుల పాటు ఈ రైలు పుదుచ్చేరి వరకు నడవనుంది. మిగిలిన నాలుగురోజులు కాచిగూడ నుంచి చెంగల్‌పట్టు మధ్య నడవనుందన్నారు. ప్రస్తుతం 17651 / 17652 నెంబర్ల పేరుతో నడుస్తున్న ఈ రైలు జూలై 8 నుంచి 17653 / 17654లుగా రైల్వే అధికారులు మార్చనున్నారని చెప్పారు.

అంజద్‌బాషాతో ఫొటోలో ఆర్పీ లక్ష్మీప్రసన్న



డోంట్ కేర్..

- వైసీపీకి అండగా ఆర్పీలు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 28: కడప నగరంలో మెప్మా ఆర్పీలు కొందరు బరి తెగించారు. ఎన్నికల అధికారులు ఉద్యోగులు జాగ్రత్తగా ఉండాలని ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పదే పదే హెచ్చరిస్తున్నా మెప్మా ఆర్పీలు మాత్రం డోంట్ కేర్ అంటున్నారు. రెండురోజులక్రితం రాజారెడ్డివీధికి చెందిన ఆర్పీ సుశీల వైసీపీ ప్రచారం చేస్తుండగా ఏబీఎన్, ఆంధ్రజ్యోతి వెలుగులోకి తేగా ఎన్నికల అధికారులు ఆమెను విధుల నుంచి తొలగించారు. ఈ విషయం ఆర్పీలకు అందరికీ తెలిసినా మళ్లీ గురువారం కడప నగరంలోని రామాంజనేయపురం ఆర్పీ లక్ష్మీప్రసన్న పబ్లిక్‌గా కడప వైసీపీ అభ్యర్థి అంజద్‌బాషాను కలిసి ఫొటోలు దిగారు. మంత్రి పిలవగానే వెళ్లి తమ పరిధిలోని అన్ని గ్రూపుల సభ్యులతో మాట్లాడి మీకు ఓటు వేసేలా ప్రయత్నం చేస్తానని మాట ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.

రాచమల్లు ప్రచారంలో.. ఔట్ సోర్సింగ్ ఉద్యోగి

ప్రొద్దుటూరు, మార్చి 28: ప్రొద్దుటూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాచమల్లు ప్రచారంలో జిల్లా ఆసుపత్రి ఔట్ సోర్సింగ్ ఉద్యోగి, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ వెంకటరెడ్డి పాల్గొన్నారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ లోని 36 వవార్డులో జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో వెంకటరెడ్డి ఎమ్మెల్యే రాచమల్లుతో పాటు పాల్గొన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలో పని చేస్తున్న వలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, మెప్మా ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొంటున్నా వారిని పసిగట్టి నియంత్రించడంలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై అధికార యంత్రాంగం సీరియస్‌గా దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.



36 వవార్డు లో ఎమ్మెల్యే తో పాటు ప్రచారం లో పాల్గొన్న జిల్లా ఆసుపత్రి ఔట్ సోర్సింగ్ ఉద్యోగి వెంకట్‌రెడ్డి

కడప వైసీపీలో అంతర్మథనం

YSR కాంగ్రెస్ పార్టీ

కడప అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వైసీపీలో అంతర్మథనం మొదలైంది. పలువురు కార్పొరేటర్లు, కీలకనేతలు పార్టీకి దూరదూరంగా ఉంటున్నారు. కొందరు అలక పాన్పు ఎక్కారు. సీఎం జగన్, ఎంపీ అవినాశ్‌రెడ్డితో ఉన్న సన్నిహిత సంబంధాల కారణంగా కొందరు పార్టీ మారేందుకు బయటికి రాలేని పరిస్థితి. అయితే కడప వైసీపీ నేతల్లో ఉన్న గూడుకట్టిన అసమ్మతి గుర్తించిన డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అండ్ కో ఎవరిని నమ్మాలో ఎవరిని నమ్మకూడదో అర్థంకాక అయోమయంలో పడ్డారని.. అభద్రతాభావంతో కొట్టుమిట్టాడుతున్నారని ఆ పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.



- 57 నెలలు అధికారంలో ఉన్నా కొందరికే లబ్ధి
- పట్టించుకునేవారే లేరని ఆక్రోశం
- వైసీపీ అడ్డగోలు పాలనపై ప్రశ్నలు సంధిస్తున్న టీడీపీ అభ్యర్థి
- ఆమె ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేక వైసీపీ తికమక
- అసంతృప్తి నేతలతో ఎంపీ అవినాశ్ ముఖాముఖి

(కడప-ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో కడప అసెంబ్లీ పోరు వన్‌సైడే ఉంటుంది. నన్ను ఎవరూ అడ్డుకోలేరు, నాకు ఎవరూ అడ్డురారు.. నేనే హ్యాట్రిక్ విజయం సాధిస్తానంటూ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా రెండు నెలల క్రితం కూడా ఆత్మస్థైర్యంతో ఉన్నారు. కడప అంటే డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, సురేశ్‌బాబు మాత్రమే అన్నట్టుగా.. మేం చెప్పిందే వేదం, మాదే రాజ్యమనే భ్రమలో బతికారు. అయితే టీడీపీ అభ్యర్థిగా మాధవీరెడ్డి ఎంట్రీ అయిన తరువాత మెల్లమెల్లగా అంజద్‌బాషా వర్గంలో బాగా మార్పు వచ్చినట్లు చెప్పుకొస్తున్నారు. నిన్నటిదాకా వార్ వన్‌సైడ్ అన్నట్లుగా గెలుపు మాదే అంటూ విర్రవీగారు. ఇప్పుడు సొంతింటిలోనే అసంతృప్తులు ఉండడం వైసీపీ కార్పొరేటర్లలోనే మనస్పర్థలు, అనుమాన పొరపొచ్చాలు రావడంతో.. ఆ పార్టీలో ఒకరంటే ఒకరికి అపనమ్మకం ఏర్పడే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం వచ్చి 57 నెలలు అయింది. లక్షలు ఖర్చు పెట్టి కార్పొరేటర్లుగా గెలిచాం.. జగన్‌పై పిచ్చితో పార్టీ కోసం శ్రమించాం. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత ఎలాంటి గౌరవం లేదు. పేరుకే కార్పొరేటర్లు.. పర్సంటేజీలు ఇస్తే తప్ప పనులు ఇవ్వలేదనే కొందరు కార్పొరేటర్లు ఆగ్రహంతో ఉన్నారు.

ఎంపీ అవినాశ్‌రెడ్డితో నేరుగా..

కడప అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పలువురు వైసీపీ కీలక నేతలు, కార్పొరేటర్లు అసంతృప్తితో రగిలిపోతున్నట్లు చెబుతారు. ఎవరు పార్టీ మారుతారో, ఎవరు వచ్చే ఎన్నికల్లో పనిచేయరో అన్న భయం అంజద్‌బాషా అనుచరుల్లో కొనసాగుతోందని ప్రచారం ఉంది. కడప అసెంబ్లీ టికెట్‌ను మాజీమంత్రి దివంగత ఖలీల్‌బాషా తనయుడు సొహైల్‌తో పాటు అఫ్జల్‌ఖాన్ ఆశిస్తూ వచ్చారంటారు. అయితే ఈసారి డిప్యూటీ సీఎంనే తిరిగి కొనసాగించాలని సీఎం జగన్ డిసైడ్ అయ్యారు. సొహైల్ పార్టీ మారతారనే వదంతులు రావడంతో హుటాహుటిన ఎంపీ అవినాశ్‌రెడ్డిని రంగంలోకి దింపి ఆయన బుజ్జగించే ప్రయత్నం చేశారు. అలాగే మరికొందరు కార్పొరేటర్లు, ముఖ్య నేతలను నేరుగా ఎంపీ అవినాశ్‌తోనే మాట్లాడిస్తూ మేమున్నామని భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

మాధవీరెడ్డి ప్రశ్నలకు బదులేదీ..?

2004కు ముందు కడపలో టీడీపీ ఆధిక్యత సాధించేది. అయితే 2004, 2009, 2014, 2019 ఎన్నికల్లో ఓడిపోతూ వచ్చింది. ఈసారి ఎలాగైనా గెలవాలని చంద్రబాబు డిసైడ్ అయ్యారు. ఇందులో భాగంగా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి సతీమణి మాధవీరెడ్డిని ఐదు నెలల క్రితం ఇన్‌చార్జిగా ప్రకటించారు. ఇటీవలే అభ్యర్థిగా ప్రకటించారు. అయితే వచ్చినప్పటి నుంచి ఆమె కడప అసెంబ్లీలో బాగా చుట్టేస్తున్నారు. ఇంటింటికీ వెళుతున్నారు. అంజద్‌బాషా, వైసీపీ వైఫల్యాలపై చాలా సూటిగా విమర్శిస్తూ జనాల్లోకి బాగా దూసుకెళుతున్నారు. ఇంటింటికీ వెళ్లినప్పుడు జగన్ మాకు సంక్షేమ పథకాలు ఇచ్చారని జనాలు చెబితే.. "అలాగా.. ఓకే 2019లో కరెంటు బిల్లు ఎంత.. అప్పుడు మీ ఇంట్లో ఎన్ని ఫ్యాన్లు, ఏసీలు ఉన్నాయి. ఇప్పుడు మీకు వస్తున్న కరెంటు బిల్లు ఎంత.. అప్పుడు మీఇంటి ఆస్తి పన్ను ఎంత, చెత్త పన్ను ఉండిందా అంటూ" ఇలా ఇంటింటికీ బాగా వివరిస్తూ పోతున్నారు. పది మనకు ఇచ్చి వంద లాగేస్తున్నాడనే విషయాన్ని ఆమె జనం బుర్రల్లోకి బాగా తీసుకెళ్లారు. ఆమె ప్రశ్నలకు వైసీపీలో సమాధానం లేదు.. కేవలం వ్యక్తిగతంగా మీది ఇక్కడ కాదు, నాన్‌లోకల్ అంటూ సమాధానం ఇస్తున్నారు. అంతే తప్ప అడిగిన ప్రశ్నలకు సమాధానాలు లేవు. దీంతో వైసీపీ కార్పొరేటర్లు పక్క చూపు చూస్తారనే భయం ఆ పార్టీ పెద్దల్లో ఉంది.

బస్సు యాత్ర అంతంతే

ప్రొద్దుటూరులో జరిగిన మేమంతా సిద్ధం బహిరంగసభను వైసీపీ చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. లక్ష 50వేల మంది జనాలను తీసుకురావాలనుకున్నారు. కడప కార్పొరేటర్లకు జనం తరలించే బాధ్యతను పెట్టారు. అయితే చాలా మంది "ఎన్నికల్లో లక్షలు ఖర్చు పెట్టాం.. అధికారంలోకి వచ్చినా మాకు ఉపయోగం లేదు. ఎవరూ పలకలేదు. ఎవరెవ రిరో పదవులు ఇచ్చారు. మీకు కావాల్సిన వారికి పదవులు ఇచ్చారు. మీకు జనం కావాలంటే ఇతరత్రా వాటికోసం మమ్మల్ని అడుగుతారా" అంటూ కొందరు కార్పొరేటర్లు అసహనం వ్యక్తం చేశారని అంటున్నారు. అందుకే ప్రతి డివిజన్‌కు బస్సును పంపినా జనం మాత్రం పెద్దగా వెళ్లలేని సమాచారం. ప్రొద్దుటూరు సభకు హాజరైన జనాన్ని చూసినా ఈ విషయం స్పష్టమై పోతుంది.

ప్రాణ రక్షణ కల్పించండి

- బ్ర.మఠం పీఠాధిపతి ధర్మపత్ని మారుతీ మహాలక్ష్మి



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న మారుతీ మహాలక్ష్మి

కడప (మారుతీనగర్), మార్చి 28: బ్రహ్మంగారి మఠం పీఠాధిపతి స్వర్గీయ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామి మొదటి భార్య కుమారుల నుంచి తనతో పాటు తన కుమారులకు ప్రాణరక్షణ కల్పించాలని స్వామివారి రెండవ ధర్మపత్ని ఎస్.మారుతీ మహాలక్ష్మి ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడారు.

స్వామి వారి మొదటి ధర్మపత్ని 2005 డిసెంబరులో మరణించగా 2006 ఫిబ్రవరి 19న తనను వివాహం చేసుకున్నారన్నారు. తనకు ఇద్దరు కుమారులు కలిగారన్నారు. మొదటి ధర్మపత్నికి మొత్తం 8 మంది సంతానం కాగా వారిలో నలుగురు మగవారు, నలుగురు ఆడవారు అన్నారు. తన భర్త 2021 మేనెలలో శివైక్యం చెందారన్నారు. బ్రహ్మంగారి మఠం తదుపరి పీఠాధిపతిగా తన కుమారుడు బాధ్యతలు చేపట్టేలా చేయాలని స్వర్గీయ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామి మరణానికి ముందే వీలునామా రాశారన్నారు. దీంతో నాటి నుంచి మొదటి భార్య కుమారులు వెంకటాద్రిస్వామి, దత్తాత్రేయస్వామి పనిగట్టుకుని తనతో పాటు తన కుమారులను బ్రహ్మంగారి మఠం నుంచి పంపించేసేందుకు పథకాలు రచించడం ప్రారంభించారన్నారు. ఆ క్రమం లో సోషల్ మీడియాను వేదికగా చేసుకుని తన బాగు కోసం సహకారం అందిస్తున్న తన అక్క భర్తను ఇబ్బందులపాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తనపట్ల లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తన కుమారులైన గోవిందస్వామి, వరదరాజస్వామిలను మఠానికి పీఠాధిపతులను కాకుండా చేయడమే లక్ష్యంగా వారు పావులు కదుపుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం, జిల్లా పోలీసు అధికారులు స్పందించి వారి బారినుంచి తన కుటుంబానికి ప్రాణరక్షణ కల్పించడం తో పాటు తన కుమారులలో ఒకరిని పీఠాధిపతిగా చేయాలని కోరారు. సమావేశంలో ఆమె బావ పాలెం శ్రీనివాసులు పాల్గొన్నారు.

జగన్ రెడ్డి.. పచ్చి అబద్ధాల కోరు

- హంతకులెవరో, నిర్దోషులెవరో ప్రజలందరికీ ఎరుకే
- బస్సుయాత్ర పేరుతో మరోసారి ప్రజలను బురిడీ కొట్టించలేవు
- జిల్లాలోని రెండు అసెంబ్లీ సీట్లలో గెలుపు మాదే
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగళ శశిభూషణ్‌రెడ్డి

కడప (మారుతీనగర్), మార్చి 28: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పచ్చిఅబద్ధాల కోరుగా మారారని, నోరుంది కదా అని ప్రజలను తన మాయమాటలతో మరోసారి బురిడీ కొటించేందుకు జనం మధ్యకు వస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగళ శశిభూషణ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అధికారం చేపట్టాక జనం మధ్యకు రావాలంటే భయంతో పరదాల చాటున తిరిగిన జగన్‌రెడ్డి ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తప్పని పరిస్థితుల్లో మేమంతా సిద్ధం అంటూ బస్సుయాత్ర పేరుతో పచ్చి అబద్ధాలు వల్లెవేస్తున్న తీరు దారుణమన్నారు. గురువారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. స్వంత చిన్నాన్న వివేకానందరెడ్డిని హత్య చేయించింది ఎవరనే విషయం ఇటు ప్రజలకు, అటు ఆ భగవంతునికి కూడా తెలుసని, పైపెచ్చు హంతకునికి మద్దతిస్తున్నది కూడా ఎవరనే సంగతి కూడా అందరికీ తెలుసంటూ ప్రొద్దుటూరులో జరిగిన మేమంతా సిద్ధం సభలో జగన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు చాలా శోచనీయమన్నారు. వివేకానందరెడ్డిని హత్యచేయించిన వ్యక్తిని సిద్ధం సభలో పక్కనే ఉంచుకుని మరీ ఇతరులపై నిందారోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గత ఎన్నికల్లో వివేకానందరెడ్డి హత్యను సాకుగా చూపి ప్రజలను నమ్మించి విజయం సాధించిన జగన్‌రెడ్డి, మరోసారి అదే పంథాలో గెలుపొందాలనుకునే పగటి కల ఫలించదన్నారు. ఏది ఏమైనా వివేకాను చంపించిన హంతకులెవరో, నిర్దోషులెవరో ప్రజలందరికీ బాగా తెలుసు అన్నారు.

రానున్న 5 సంవత్సరాలలో రాష్ట్రంలో 22 లక్షల ఇళ్లు నిర్మిస్తామని సిద్ధం సభలో చెప్పడం దారుణమన్నారు. 2014లో కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం హయాంలో నాటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న వెంకయ్యానాయుడు మన రాష్ట్రానికి 25 లక్షలు ఇళ్లు కేటాయించగా గత తెలుగుదేశం ప్రభుత్వం 3 లక్షల ఇళ్లు నిర్మించిందన్నారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇంటి కల నెరవేర్చడంలో చేతులెత్తేసిందన్నారు. సీఎం స్వంత నియోజకవర్గం పులివెందులలో 8,100 ఇళ్లు కేటాయించగా వాటిలో కొన్నింటిని నిర్మించగా అవి కూడా గట్టిగా కాలితో తన్నితే పడేలా ఉన్నాయన్నారు. కేంద్రం నిధులిచ్చినా వాటితో పేదలకు ఇళ్లు కట్టివ్వలేని దుస్థితిలో ఉంటూనే అదేదో వైసీపీ ప్రభుత్వమే నిర్మించి ఇస్తున్నట్లుగా జగనన్న కాలనీలంటూ భజన చేయడం దారుణమన్నారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించనవే అన్నారు. వాటిని కూడా వైసీపీ ప్రభుత్వమే నిర్మించినట్లుగా గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లాలో పొత్తులో భాగంగా తమ పార్టీకి కేటాయించిన బద్వేల్, జమ్మలమడుగు నియోజకవర్గాలలో గెలిచి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పాలెం సురేశ్‌కుమార్‌రెడ్డి, కడప పార్లమెంట్ కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి బి.పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, సుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న వంగళ శశిభూషణ్‌రెడ్డి

85 ఏళ్లు దాటిన వారికి ఇంటి వద్దనే ఓటు : కలెక్టర్


కడప(కలెక్టరేట్), మార్చి28: ఎన్నిల ఓటింగ్ సమయంలో ప్రత్యేక క్యాటగిరీకి చెందిన దివ్యాంగులు, 85 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్లకు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో జాయింట్ కలెక్టర్ గణేశ్ కుమార్, కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, అన్ని వర్గాల రిటర్నింగ్ అధికారులతో సాధారణ ఎన్నికల సన్నద్ధతపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ఏప్రిల్ 5వ తేదీలోగా అన్ని ఏర్పాట్లను సంబంధిత ఏఆర్వోల ద్వారా సిద్ధం చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు

ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

ఎన్నికల సందర్భంగా ప్రసార మాధ్యమాల్లో ప్రసారమయ్యే రాజకీయ ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానటరింగ్ కమిటీని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి ఇవ్వడంతో పాటు చెల్లింపు వార్తలను (పెయిడ్ న్యూస్) ఈ కమిటీ పర్యవేక్షిస్తుందని, మీడియా ఉల్లంఘనలపై తగు చర్యలు తీసుకుంటామని వివరించారు.



తాత్కాలిక సర్పంచ్‌గా బాధ్యతలు చేపడుతున్న ఉప సర్పంచ్ యద్దపు సుదర్శన్‌రెడ్డి

అంతా మా ఇష్టం..!

- నిబంధనలకు విరుద్ధంగా సర్పంచ్ ఎన్నిక
- రెండేళ్లుగా సమావేశాలకు గైర్హాజరైన ఉప సర్పంచ్
- వార్డు మెంబర్లకు ముందస్తు సమాచారం లేకుండా.. ఒకేసారి ఎన్నిక
- ఇటీవల పంచాయతీకి రూ.35 లక్షల నిధులు మంజూరు

బ్రహ్మంగారిమఠం, మార్చి 28: వైసీపీ నేతలు అంతా మా ఇష్టం అనేలా వ్యవహరిస్తున్నారు. రూల్స్ గీల్స్ జాన్తానై అంటున్నారు. రెండేళ్లుగా అసలు దేశంలోనే లేని ఉపసర్పంచ్‌ను మూడురోజుల క్రితం సొంతూరికి రప్పించి.. గురువారం సర్పంచ్‌గా ఎంపిక చేశారు. దీనికంతా కారణం ఇటీవల పంచాయతీకి విడుదలైన లక్షల నిధులని గుసగుసలు వినిపిస్తున్నాయి. వివరాలు ఇలా..

బ్రహ్మంగారిమఠం మండలంలోని మేజరు పంచాయితీ సోమిరెడ్డిపల్లె. ఈ పంచాయతీకి వైసీపీ మద్దతుతో సోమిరెడ్డిల్లె రామయ్య సర్పంచ్‌గా ఎన్నికల్లో గెలుపొందారు. ఆయన ఈ ఏడాది జనవరి 16న అనారోగ్యంతో మృతి చెందారు. కాగా.. రెండు సంవత్సరాలుగా గ్రామపంచాయతీ సమావేశాలకు ఉప సర్పంచ్ యద్దపు సుదర్శన్‌రెడ్డి గైర్హాజరయ్యారు. ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లారు. ఇటీవల పంచాయతీకి రూ.35 లక్షలు నిధులు వచ్చాయి. సర్పంచ్ మరణించడంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. ఈ నిధులు వాడుకునేందులు వైసీపీ పెద్దలు స్కెచ్ వేశారు. విదేశాల్లో ఉన్న ఉపసర్పంచ్‌ను మూడు రోజుల క్రితం రప్పించారు. 16మంది వార్డు సభ్యులను గురువారం పంచాయతీ కార్యాలయానికి రావాలని చెప్పారు. వారిలో 10 మంది వచ్చారు. వీరితో సమావేశం నిర్వహించి ఉప సర్పంచ్ యద్దపు సుదర్శన్‌రెడ్డిని తాత్కాలిక సర్పంచ్‌గా ఎన్నుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ రావు ప్రకటించారు. ఈ మేరకు మినిట్స్ పుస్తకంలో నమోదు చేశారు. ఇటీవల బడ్జెట్ పంచాయతీకి వచ్చిందని, ఆలస్యం చేస్తే వెనక్కి పోతుందన్న భయంతో తాత్కాలిక సర్పంచ్‌గా ఆయనను ఎన్నుకున్నామని వివరించారు. దీనిపై డీఎల్‌డీవో రమణారెడ్డిని వివరణ కోరగా.. రెండేళ్లపాటు స్థానికంగా లేని వ్యక్తికి సర్పంచ్ పదవిలో కూర్చోబెట్టడం నిబంధనలకు విరుద్ధమని అన్నారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

గండిలో హుండీల లెక్కింపు


లెక్కింపును పర్యవేక్షిస్తున్న అసిస్టెంట్ కమిషనర్

చక్రాయపేట, మార్చి 28: గండి క్షేత్రంలో గురువారం హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి మాట్లాడుతూ 52 రోజులకు గాను రూ.9,89,197, అన్నదానం హుండీ ద్వారా రూ.11,619 కలిపి మొత్తం రూ.10,00,816 ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ కావలి కృష్ణతేజ, పాలక మండలి సభ్యులు, దేవాదాయ శాఖ సూపర్‌వైజర్ ప్రసాదరావు, ప్రధాన, ఉపప్రధాన అర్చకులు కేసరి స్వామి, రాజాస్వామి, ఏపీజీబీ మేనేజర్ అశోక్‌కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలను

బడిలో చేర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మిట్టా కేశవరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 28: ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ, సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కడప మండల వనరుల కేంద్రంలో సహిత విద్య అవగాహన సదస్సు మిట్టా కేశవరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులైన పిల్లల పట్ల దయతో వ్యవహరించడంతో పాటు సమీప పాఠశాలల్లో చేర్పించాలన్నారు. విజన్ 2025లో భాగంగా ప్రతి విద్యార్థికీ డిజిటల్ పరిజ్ఞానం అందించాలన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వారి పనులు వారే చేసుకోవడంతో పాటు వారిలో ఉన్న నైపుణ్యాలను మెరుగుపరచాలన్నారు. మెడికల్ డిపార్ట్‌మెంటు వారు దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన ఆరోగ్య, సలహాలు, సూచనలు అందించాలని కోరారు. ప్రత్యేక అవసరాలు గల వారి చట్టాలను వారికి అందాల్సిన ప్రభుత్వ పథకాలను రిమ్స్ వైద్యులు విష్ణువందన, ఫకృద్దీన్ తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ప్రధానోపాధ్యాయులు, సంక్షేమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మెడికల్ ఉద్యోగులు పాల్గొన్నారు.


18 మోటార్ బైకులు స్వాధీనం

ఇద్దరు నిందితుల అరెస్టు


వివరాలు తెలుపుతున్న డీఎస్పీ, పట్టుబడ్డ బైకులు, నిందితులు, పోలీసులు


ముద్దనూరు మార్చి 28: మండల పరిధి కొర్రపాడు గ్రామానికి చెందిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి 18 మోటర్ బైకులు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ టీడీ యశ్వంత్ తెలిపారు. గురువారం స్థానికపోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీమాట్లాడుతూ ఈనెల 22వ తేదీ రైల్వే స్టేషన్ ఎదుట రైల్వే ఉద్యోగి పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. దీనిపై ప్రత్యేక నిఘా పెట్టి మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో జమ్మలమడుగు బైపాస్ రోడ్డులో సీఐ దస్తగిరి సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా కొర్రపాడు గ్రామానికి చెందిన పాస్కులపాటి అబ్దుల్ బాషా, కొత్తపల్లె చిన్న కుళ్లాయప్పలు బైకుపై వస్తూ పట్టుబడ్డారు. బైకు సంబంధించి ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో అనుమానంతో విచారించగా బైకుల దొంగతనం చేస్తున్నట్లు తెలిపారు. దీంతో రైల్వే స్టేషన్ ఎదుట చోరీకి గురైన వాహనంతో పాటు మరికొన్ని 17 మోటర్ బైకులు వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాహనాలను పాత తాళం చెవులను ఉపయోగించి బైకుల చోరీకి పాల్పడుతు న్నట్లు తెలిపారు. ముద్దనూరు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, కమలాపురం టౌన్‌లో 17 చోరీ చేసినట్లు తెలిపారు. ఎంతో చాకచక్యంగా బైకుల దొంగలను పట్టుకున్న పోలీసులను డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో సీఐ దస్తగిరి, ఎస్ఐ మైనుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


నీలం అయ్యప్ప మృతదేహం

జమ్మలమడుగు, మార్చి 28: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని నాగులకట్ట వీధిలో గురువారం నీలం అయ్యప్ప (30) అనే వ్యక్తి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. నాగులకట్టవీధిలో నివాసం ఉంటున్న నీలం అయ్యప్పకు వివాహం కాలేదు. ఇతను షేర్ మార్కెట్ సంబంధించిన వ్యాపారంలో ఉన్నాడు. ఇటీవల అప్పులు పెరిగి అప్పుల బాధతో అనారోగ్యానికి గురయ్యాడు. ఉన్నట్లుండి మనస్థాపం చెంది ఇంటిలోనే ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఖాదర్‌వలి తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


సునీల్‌కుమార్‌రెడ్డి మృతదేహం

లింగాల, మార్చి 28: మండలంలోని దొండ్లవాగు గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ బి.వి.కృష్ణయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దొండ్లవాగు గ్రామానికి చెందిన తుమ్మలూరు రామాంజనేయరెడ్డి కుమారుడు సునీల్‌కుమార్‌రెడ్డి (30) గురువారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారన్నారు. ఆత్మహత్యకు గల కారణాలను ఫిర్యాదు అనంతరం వెల్లడిస్తామని ఎస్ఐ వివరించారు.

కోడూరు కోచ్‌కు జాతీయ క్రీడా పురస్కారం


జేసీ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న రవిశంకర్‌రాజు

రైల్వేకోడూరు(రూరల్), మార్చి 28: జాతీయ స్థాయి క్రీడా పురస్కారానికి కోడూరు కోచ్ హెచ్.రవిశంకర్‌రాజు ఎంపికైనట్లు జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ గౌస్ తెలిపారు. ఈ మేరకు గురువారం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ చేతుల మీదగా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా కోచ్ రవిశంకర్ రాజు మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుంచి రాష్ట్ర, జిల్లా స్థాయి విద్యార్థులకు తైక్వాండోలో శిక్షణ ఇచ్చి జాతీయ స్థాయిలో వివిధ రంగాల్లో బంగారు, వెండి పురస్కారాలు అందుకున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయి క్రీడా పురస్కారం రావడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. జాతీయ స్థాయి పురస్కారం కోసం సహాయ, సహకారులు అందించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

చెన్నూరు, మార్చి 28 : చెన్నూరు సమీపంలోని హైవేపై బుడ్డాయపల్లె క్రాస్ రోడ్డు వద్ద గురువారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో చెన్నూరు కేఓఆర్ కాలనీకి చెందిన మహేశ్, ఖాజీపేట మండలానికి చెందిన మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. కేఓర్ కాలనీ నుంచి చెన్నూరు గ్రామంలోకి ద్విచక్రవాహనంపై వస్తున్న మహేశ్ అలాగే కడప నుంచి ఖాజీపేట వైపు వెళుతున్న మరో వ్యక్తి వాహనం ఢీకొనడంతో వారు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

అటవీ భూములను ఆక్రమించి పంటలు సాగు చేయడమే కాదు.. వీటికి విద్యుత్ సరఫరా సైతం అడ్డగోలుగా సాగిపోతోంది. పట్టా భూముల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కనెక్షన్లు తీసుకుని అక్రమంగా సాగు చేస్తున్న పొలాలకు, ఉద్యానపంటలకు సాగునీటిని అందిస్తున్నారు.



అక్రమాల సాగుకు.. అడ్డగోలు విద్యుత్

- పట్టా భూములకు కనెక్షన్..
- ఆక్రమిత భూములకు వాడకం
- అన్యాక్రాంతమవుతున్న రిజర్వు ఫారెస్టు
- ప్రేక్షకపాత్రలో అధికార యంత్రాంగం


రిజర్వు ఫారెస్టులో సాగైన మామిడి తోట

కడప (ఎన్టీఆర్ సర్కిల్), మార్చి 28: వల్లూరు మండలంలో పాపాఘ్ని నది ఒడ్డున ప్రజాప్రయోజనాల కోసం ప్రభుత్వం సుమారు 561 ఎకరాల భూమిని కేటాయించింది. మొదట ఈ భూముల్లో ఓ స్వచ్ఛంద సంస్థ మొక్కలు నాటి పరిరక్షించే బాధ్యత చేపట్టింది. ఈ తరుణంలో సమీప గ్రామాల్లోని కొంతమంది దృష్టి ఈ భూములపై పడింది. స్వల్పకాలిక పంటలే కాకుండా మామిడి వనాలు సైతం పెంచేందుకు ప్రయత్నించారు. దాదాపు 20 సంవత్సరాల క్రితం నుంచి ఈ తంతు జరుగుతోంది. అడ్డుకోవలసిన అటవీ అధికారులు అప్పట్లో చూసీచూడనట్లు వ్యవహరించడంతో క్రమేణా ఆక్రమణదారుల సంఖ్య పెరిగిపోతూ వచ్చింది. ఒక పక్క పాపాఘ్ని నదితో పాటు మరో పక్క పెన్నానది కూడా సమీపంలోనే ఉండడంతో ఉద్యాన పంటల సాగుకు అనుకూల వాతావరణం ఏర్పడింది. ఆ తరువాత వచ్చిన అటవీ అధికారులు ఆక్రమణల తొలగింపునకు ప్రయత్నించినప్పటికీ ప్రయోజనం లేకుండాపోయింది. ఇదిలా ఉంటే ఒకే సామాజిక వర్గానికి చెందిన వారే ఇక్కడ ఆక్రమణదారులు కావడం విశేషం. ఇతర సామాజిక వర్గాలకు చెందిన వారు ఎవరైనా అటవీ భూములు సాగుచేస్తే ఆక్రమణదారులు తమ పలుకుబడి ఉపయోగించి వాటిని తొలగించడంతో పాటు వారిపై కేసులు పెట్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. ఈ క్రమంలో కమలాపురం రిజర్వు ఫారెస్టులో ప్రజా అవసరాలకోసం ప్రభుత్వం కేటాయించిన భూమి అంతా అన్యాక్రాంతం అయినట్లు తెలుస్తోంది. ఉన్న కొద్దిపాటి స్థలాన్ని కూడా ఇటీవల ఓ గ్రామస్థాయి నాయకుడు అధికార పార్టీ నేతల అండతో తమ అనుచర వర్గానికి, బంధువులకు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది.

అడ్డగోలుగా విద్యుత్ సరఫరా

ఆక్రమిత అటవీ భూముల్లో సాగైన మామిడి తోటలకు అడ్డగోలుగా విద్యుత్ సరఫరా అందుతోంది. కొంత మంది తమపట్టా భూములకు విద్యుత్ కనెక్షన్లు పొంది ఆక్రమించి సాగు చేసిన తోటలకు లైన్లు లాగినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం మొత్తం రాజకీయ నాయకుల అండతోనే సాగుతుండడంతో విద్యుత్ అధికారులు కూడా అటు వైపు కన్నెత్తి చూడడంలేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి. విద్యుత్ శాఖలో కొంత మంది కిందిస్థాయి సిబ్బంది ఆక్రమణదారులు ఇచ్చే డబ్బు కోసం విద్యుత్ పరికరాలు సైతం వారికి సరఫరా చేస్తున్నట్లు సమాచారం. భారీ స్థాయిలో విద్యుత్ చౌర్యం జరుగుతున్నప్పటికీ ఏ ఒక్కరూ దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

రెండు గ్రూపులుగా అక్రమార్కులు

కమలాపురం రిజర్వు ఫారెస్టులో భూ ఆక్రమణలకు పాల్పడ్డ ఆక్రమణదారులు రెండు గ్రూపులుగా విడిపోయారు. వీరిలో కొంత మంది ఒక పార్టీ వైపు మరి కొంత మంది మరో పార్టీ వైపు ఉన్నారు. దీంతో ప్రధాన పార్టీల్లో ఏ పార్టీ అధికారంలో వచ్చినా వీరంతా సేఫ్ సైడ్‌గా ఉంటారని అంటున్నారు. ఏ పార్టీ నాయకులైనా తమ వ్యతిరేక పార్టీకి సంబంధించిన ఆక్రమణదారుల జోలికి పోరని.. ఎందుకంటే వారి భూఆక్రమణలు తొలగించేందుకు ప్రయత్నిస్తే వీరి భూములు కూడా పోతాయని జాగ్రత్తగా ఉంటారని అంటున్నారు. దీంతో కమలాపురం రిజర్వు ఫారెస్టులో ఆక్రమణలు పెరిగిపోతున్నాయని అంటున్నారు.

అక్రమ విద్యుత్ సరఫరాపై పరిశీలిస్తాం

అక్రమ విద్యుత్ సరఫరాపై పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని వల్లూరు ట్రాన్స్‌కో ఏఈ డానియేల్ తెలిపారు. ఇప్పటి వరకు తమ దృష్టికి ఈ అంశం రాలేదని, తాను ఇటీవలే ఇక్కడ బాధ్యతలు స్వీకరించానన్నారు.

కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెచ్చావా..?

- సీఎం జగన్ సిద్ధం సభ విఫలం
- ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన వైసీపీ
- టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, మార్చి 28 : రాష్ట్రంలో 25 మంది ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వంచి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా తెస్తానన్న జగన్ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక నెహ్రూ రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంతో పోరాడి సాధిస్తానన్న ప్రత్యేక హోదాను తన కేసుల కోసం రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టుపెట్టిన ద్రోహి జగన్ అన్నారు. ఐదేళ్లలో రాష్ట్ర ప్రజలను వంచించి పరిపాలిం చిన జగన్ ఏ మోహం పెట్టుకుని సిద్ధం సభలు పెట్టి ఓట్లు అడు గుతున్నాడన్నారు. నీ మోసకారి తనం అర్థం చేసుకున్న ప్రజలు సిద్ధం సభకు రాకుండా దుమ్మెత్తిపోస్తున్నారన్నారు.

లక్ష మందికి పైగా సభ అని చెబితే.. కేవలం 30వేలకు లోపు జనం వచ్చారంటే నీ పాలనను ప్రజ లు తిరస్కారించారన్నారు. నీ పాలన చూసిన కేంద్రంలోని బీజేపీ పెద్దలు రాష్ట్రం అధోగతి పాలవుతుందని.. వైసీపీ ప్రభుత్వానికి చరమ గీతం పాడేందుకే టీడీపీతో పొత్తు పెట్టుకుందన్నారు. వివేకానందరెడ్డి ని చంపిన వాళ్లను చంద్రబాబు వెంట బెట్టుకుని తిరుగుతున్నాడని జగన్ ఆరోపించడం హేయమైనదన్నారు. వివేకానంద రెడ్డి హత్య కేసులో జైలులో ఉన్నది ఎవరు.. నిందితుడైన అవినాష్‌రెడ్డిని సీబీఐ అరెస్టు చేయనీయకుండా కాపాడుతున్నది నీవు కాదా జగన్ అని విమర్శించారు. నిసిగ్గుగా మీ చిన్నాన్నను చంపిన నిందితుడైన అవి నాష్‌రెడ్డిని పక్కన పెట్టుకుంది నీవా చంద్రాబాబా అని ప్రశ్నించారు. నీ అబద్ధాలు, దుర్మార్గాలు, మోసాలు రాష్ట్ర ప్రజలు గుర్తించారన్నారు.

అందుకే నీ సభలకు బస్సు యాత్రకు జనం నుంచి స్పందన లేద న్నారు. ప్రొద్దుటూరులో రూ.516 కోట్లకు వేసిన శిలాఫలకాలు, అభివృద్ధి పనులు ఏమయ్యాయో సభలో మాట్లాడలేని పరిస్థితి వైసీ పీది అన్నారు. 516 కోట్ల నిధులు కేటాయించిన ఆ పనులకు ఎంత మేరకు బిల్లులు చెల్లించారో చెప్పగలరా అన్నారు. ప్రొద్దుటూరులో మీరు వేసిన ఫ్లెక్సీలకు సైతం మట్కా గుట్కా బుకీల డబ్బులతో వేసినవేనని ఆరోపించారు. సమావేశంలో మాజీఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, మార్తల లక్ష్మీరెడ్డి జనసేన ప్రతినిధి సుంకర మురళీ తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీల అమలులో జగన్ విఫలం

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నజీర్

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 28: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్ర విభజన హామీల అమలులో పూర్తిగా విఫలం అయ్యారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పీఎం నజీర్ విమర్శించారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొంత జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీని కూడా సాధించలేకపోయారన్నారు. బీజేపీతో లోపాయికారిగా పొత్తుపెట్టుకుని పార్లమెంటులో వివిధ రకాల బిల్లులకు మద్దతు తెలిపిన జగన్ విభజన హామీలను ఎందుకు సాధించుకోలేకపోయారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చెప్పే మాయమాటలను నమ్మే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలు లేరన్నారు. వైఎస్ వివేకానందరెడ్డిని చంపింది ఎవరో జిల్లా ప్రజలందరికీ తెలుసునని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా సిద్ధం బహిరంగ సభలో సీఎం మాట్లాడడం దారుణమన్నారు. సొంత చెల్లెళ్లే ఆయన హత్యపై విమర్శలు చేస్తున్న విషయాన్ని గుర్తించాలన్నారు. వివేకా హంతకులకు ఎప్పటికైనా శిక్ష తప్పదని స్పష్టం చేశారు. త్వరలోనే ప్రజలు జగన్‌ను ఇంటికి పంపడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కిడ్నాప్‌నకు యత్నించిన గ్యాంగ్ అరెస్టు

- కారు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం


కిడ్నాప్ వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ వాసుదేవన్

కొత్తచెరువు, మార్చి 28: మండల కేంద్రానికి చెందిన ఉప్పు వెంకటాచలపతిని ఈనెల 24వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు కిడ్నాప్ చేసేందుకు కొందరు యత్నించారు. బాధితుడు వెంకటాచలపతి వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేపట్టారు. ఈ క్రమంలో ముదిగుబ్బ మండలం రాళ్లఅనంతపురం క్రాస్ వద్ద గురువారం తెల్లవారుజామున 8 మందిని అరెస్టు చేశారు. కొత్తచెరువు పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ వాసుదేవన్ సీఐ రాజారమేశ్‌తో కలిసి అరెస్టు వివరాలను వెల్లడించారు. కొత్తచెరువు గ్రామానికి చెందిన ఉప్పుచలపతి చికెన్‌సెంటర్‌ను నడుపుకుంటూ జీవనం సాగించేవారు. అయితే అతడి సమీప బంధువు అయిన భానుచందర్ పెనుకొండలో పంచర్ షాపు నిర్వహించేవాడు. వ్యసనాలకు బానిస అయిన అతను ఎలాగైనా అక్రమమార్గంలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో పెనుకొండ ప్రాంతంలో ఉన్న తన స్నేహితులు, కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన తన బంధువుల సహాయంతో ప్రణాళిక ప్రకారం చలపతిని కిడ్నాప్ చేయడానికి పథకం వేశారు. ఈ క్రమంలో చలపతిని ఈనెల 24న తన ఇంటి సమీపంలో కిడ్నాప్ చేసి కారులో ముదిగుబ్బ వైపునకు వెళ్లారు. విషయం పసిగట్టిన చలపతి భార్య 100 కాల్ చేయడంతో పోలీసులు అప్రమత్తమై ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీ చేపట్టారు. దీంతో తాము దొరికిపోతామన్న భయంతో వారు చలపతిని ముదిగుబ్బ గ్రామ శివారులో వదిలి పారిపోయారు. కిడ్నాప్‌నకు యత్నించిన 8 మందిని అదుపులోకి తీసుకున్నామని, అందులో ఒక బాలనేరస్థుడు కూడా ఉన్నాడని డీఎస్పీ తెలిపారు. అలాగే కారు 8 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. పెనుకొండ మండలం షైలపురం గ్రామానికి చెందిన బానుచందర్, చెన్నేకొత్తపల్లి మండలం నాగసముద్రం గ్రామానికి మొండిగట్ల శ్రావణ్, రొద్దం మండలం బొక్సంపల్లికి చెందిన హరిజన సూరి, కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన రుషికేశవరెడ్డి, పంగ విష్ణువర్దన్, ఇరగం శివగంగాధర్‌రెడ్డి, ఇరగం గంగాధర్‌రెడ్డి, కడప జిల్లా రాజుపాలెం మండలానికి చెందిన కందుకూరు శివకిశోర్‌రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. కేసును ఛేదించిన సీఐ రాజారమేశ్, ముదిగుబ్బ పోలీసులను ఎస్పీ మాధవరెడ్డి అభినందించి ప్రోత్సాహక నగదు బహుమతికి ఎంపిక చేశారని చెప్పారు.

మసీదులోనే వ్యక్తి దారుణ హత్య


హత్యకు గురైన ఇంతియాజ్ అలీఖాన్

రాయచోటిటౌన్, మార్చి 28: జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని బండ్లపెంటలో గల ఫాతిమా మసీదులో గురువారం రాత్రి హత్య జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. పట్టణంలోని కొత్తపల్లెకు చెందిన ఇంతియాజ్ అలీఖాన్ (55), సాబ్‌జాన్ ఇరువురూ వరుసకు సోదరులవుతారు. వీరిరువురి మధ్య గత కొద్దిరోజులుగా డబ్బుల విషయమై సమస్యలు తలెత్తాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇఫ్తార్ అనంతరం ఇంతియాజ్ అలీఖాన్ బండ్లపెంటలోని ఫాతిమా మసీదులో నమాజ్ చేసుకుంటుండగా సాబ్‌జాన్ అక్కడికి వెళ్లి కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. కొనఊపిరితో ఉన్న అతడిని ఆసుపత్రికి తరలించే లోపు మృతి చెందాడు. ఈ మేరకు అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ భక్తవత్సలం సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన హత్యపై విచారించడంతో పాటు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల తనిఖీల్లో రూ.17 లక్షల నగదు సీజ్

కడప (క్రైం), మార్చి 28: కడప నగరంలోని అప్సరా సర్కిల్ వద్ద గురువారం రాత్రి చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించగా రూ.17 లక్షల నగదు పట్టుబడింది. కడపకు చెందిన వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పోలీసులు ఆపి తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి రసీదులు లేకుండా ఉన్న ఆ నగదును గుర్తించారు. పట్టుకున్న డబ్బు వివరాలను సీఐ అడిగినప్పటికీ ఆ వ్యక్తి నుంచి సరైన సమాధానం రాకపోవడం, డబ్బుకు సంబంధించి రసీదులు, పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసి ఐటీ అధికారులకు అప్పగించినట్లు సీఐ వివరించారు.

లింగాలలో రూ.7.18 లక్షలు పట్టివేత

లింగాల, మార్చి 28: మండలంలోని అంబకపల్లె గ్రామ చెక్‌పోస్టు వద్ద గురువారం సాయంత్రం చేపట్టిన వాహనాల తనిఖీల్లో ఆరుగురి నుంచి రూ.7.18 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు లింగాల ఎస్ఐ బి.వి.కృష్ణయ్య తెలిపారు. ముదిగుబ్బ రోడ్డు నుంచి వస్తున్న బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీలు చేయగా ఈ నగదు పట్టుబడిందన్నారు. ఈ నగదుకు సంబంధించి ఎటువంటి బిల్లులు, ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేశామన్నారు. ఉన్నతాధికారులకు తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు.

పొలతల హుండీ ఆదాయం రూ.30.75 లక్షలు


కానుకలను లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

పెండ్లిమర్రి, మార్చి 28: మండలంలోని పొలతల క్షేత్రంలో మల్లేశ్వర స్వామి దేవస్థానంలోని హుండీలను గురువారం లెక్కించారు. కడప గ్రూప్ టెంపుల్స్ ఈఓ శ్రీధర్ పర్యవేక్షణంలో లెక్కించగా రూ.30,75,482 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ నాగమల్లారెడ్డి, పోలీస్ సిబ్బంది, ఇండియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్, సిబ్బంది, శ్రీవారి సేవకులు బాలశివనాగిరెడ్డి బృందం, రాజగోపాల్‌రెడ్డి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

సి విజిల్ యాప్‌పై అవగాహన అవసరం

చెన్నూరు, మార్చి 28:మండలంలోని బీఎల్‌ఓలు సి విజిల్ యాప్‌పై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దారు ప్రకాశ్‌బాబు అన్నారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సి విజిల్ యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యాప్ ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి, ఎలా ఉపయోగించాలి అన్నదానిపై వివరించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి బీఎల్‌ఓ సి విజిల్ యాప్ గురించి తెలిసి ఉండాలన్నారు. ఈ యాప్ వల్ల రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటున్నారా, నిబంధనలకు లోబడి నడుచుకుంటున్నారా, అన్నది అర్థమవుతుందన్నారు. ప్రచారంలో మద్యం, డబ్బు, ఇతర ఓటర్లకు గాలం వేసే పద్ధతులు లాంటి ఎన్నికల నిబంధనలకు విరుద్ధమైన పనులు ఎక్కడైనా ఉంటే వాటిని ఫోటోలు తీసి సి విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. దీనిపై శిక్షకుడు అజయ్ బీఎల్‌ఓలకు వివరించారు. డీటీ వెంకటరమణ, ఆర్‌ఐలు సౌజన్య, సృజన, సీనియర్ అసిస్టెంట్ క్రిష్ణవేణి, వీఆర్వోలు పాల్గొన్నారు.

బహుభాషా పండితుడు పుట్టపర్తి

పులివెందుల రూరల్, మార్చి 28: బహుభాషా పండితుడు పుట్టపర్తి నారాయణాచార్యులు అని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్.ఎస్ బేగ్ అన్నారు. గురువారం స్థానిక కళాశాలలో పుట్టపర్తి నారాయణాచార్యుల జయంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. డీన్ మాట్లాడుతూ 14ఏళ్ల వయసులో పద్యకావ్యాన్ని రాశారని, హృషికేశ్‌లో ఆయన ప్రతిభకు ముగ్ధుడైన శివానంద సరస్వతి ఆయనకు సరస్వతీపుత్ర బిరుదునిచ్చి సత్కరించారన్నారు.

నీళ్లు, నిధులు నియామకాల కోసం ఉద్యమిద్దాం

కడప (మారుతీనగర్), మార్చి 28: 'రాయలసీమ అభివృద్ధికి నీళ్లు, నిధులు, నియామకాల సాధన కోసం ఉద్యమిద్దాం' అని గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక రాష్ట్ర కన్వీనర్ కారు ఆంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ఆవిర్భావ సభ డీఎం ఓబులేసు అధ్యక్షతన జరిగింది. సభకు ముఖ్య అతిథిగా ఆయనతో పాటు బ్లడ్ టు లివ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పట్టుపోగుల పవన్‌కుమార్ హాజరై మాట్లాడారు.

నీటి సమస్యను యుద్ధప్రాతిపదికన తీర్చాలి: సీపీఎం

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 28 : కడప జిల్లాలో మైదుకూరు, కడప నగరంలో తీవ్రమైన మంచినీటి ఎద్దడి నెలకొందని, సమస్యను వెంటనే తీర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం ఆ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈసంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్‌లో జిల్లాలో తగినంత వర్షపాతం లేకపోవడంతో కుందూ, పెన్నానదులు ఎండిపోయాయని, ఈ విషయం పాలకులకు అధికారులకు తెలిసినా ఏప్రిల్, మే నెలల్లో మంచినీటి సమస్యపై ఏ మాత్రం శ్రద్ధ పెట్టడంలేదన్నారు. నగరంలో ఐదారు రోజులకు ఒకసారి నీటిని సరఫరా చేస్తున్నారని, అది కూడా సరిపడా రావడంలేదని మైదుకూరు, కడప నగరంలో చాలా ప్రాంతాల్లో నీటి సమస్య ఉందని, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారన్నారు. కొన్ని ప్రాంతాలకు ట్యాంకర్లు కూడా రావడంలేదని, కడప నగర ప్రజలు మంచినీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. యుద్ధప్రాతిపదికన బోర్లు వేసి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. నీటి సమస్య పరిష్కారానికి ఎన్నికల కోడ్ నుంచి మినహాయించాలని, జిల్లా ఉన్నతాధికారులు శ్రద్ధ పెట్టాలని కోరారు. నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడంలో పాలక ప్రభుత్వాలు విఫలం చెందాయని ధ్వజమెత్తారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రామ్మోహన్, కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయం చారిత్రక అవసరం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 28 : వైసీపీ ప్రభుత్వ అరాచక పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగించేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం చారిత్రక అవసరమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి తెలిపారు. గురువారం కడప నగరం 12వ డివిజన్ శ్రీనివాస నగర్‌లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. అలాగే టీడీపీ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివకొండారెడ్డి, రవిశంకర్‌రెడ్డి, జయరాం, నరసింహారెడ్డి, పార్వతి, నబీకోట్ శ్రీనివాస్, రాజగోపాల్‌రెడ్డి, శారదమ్మ, అమర్‌నాథ్‌రెడ్డి, పీరయ్య, మణికంఠ పాల్గొన్నారు.

టీడీపీలో భారీగా చేరికలు

కడప నగరం 12వ డివిజన్‌లో టీడీపీలోకి స్థానికులు భారీ సంఖ్యలో చేరారు. వారికి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ టీడీపీ విజయానికి కృషి చేయాలని అధికారంలోకి వచ్చాక పార్టీ విజయానికి కృషి చేసిన వారికి గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు.

టీడీపీ పాలనలోనే మహిళాభివృద్ధి




టీడీపీలోకి చేరిన కడప నగరం 12వ డివిజన్ ప్రజలు... చెన్నూరులో మహిళలతో మాట్లాడుతున్న పుత్తా సరళమ్మ, చైతన్య

చెన్నూరు, మార్చి 28 : టీడీపీ పాలనలోనే మహిళాభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సతీమణి పుత్తా సరళమ్మ, యువనేత పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి సతీమణి పుత్తా చైతన్య అన్నారు. చెన్నూరు కొత్తరోడ్డు ప్రాంతం 16వ వార్డులోని రాజులకాలనీ, సరస్వతీనగర్, లక్ష్మీనగర్, శ్రీరాంనగర్ ప్రాంతాల్లో బాబుతో భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా మహాశక్తి పథకం కింద పొందే లబ్ధి గురించి వివరించారు.

టీడీపీని ఆదరించి మంచి విజయం అందించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల కన్వీనరు కె.విజయబాస్కర్‌రెడ్డి, చెన్నూరు మాజీ సర్పంచ్ దంపతులు పొట్టిపాటి ప్రతాప్‌రెడ్డి, రాజేశ్వరమ్మ, జిల్లా బలిజ సంఘం నేత ఆకుల ప్రసాద్‌బాబు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి, ఉపాధ్యక్షుడు కుంచెం రామక్రిష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి ఆవుల పవన్‌కుమార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, తెలుగు యువత అధ్యక్షుడు పాలగిరి సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువులో రాణించాలంటే మైండ్ మేనేజ్‌మెంట్ తప్పనిసరి

● ప్రముఖ మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ వెంకటరాముడు



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరాముడు

కడప (నాగరాజుపేట), మార్చి 28 : విద్యార్థులు చదువులో రాణించాలంటే మైండ్ మేనేజ్‌మెంట్ తప్పనిసరి అని ప్రముఖ మానసిక వైద్యనిపుణుడు, రిమ్స్ ఆసుపత్రి మానసిక వ్యాధి వైద్యుడు డాక్టర్ ఆర్.వెంకటరాముడు పేర్కొన్నారు. గురువారం కడప జిల్లా యువజన సర్వీసుల శాఖ, స్టెప్ వారి ఆధ్వర్యంలో స్థానిక స్పిరిట్స్ డిగ్రీ కాలేజీలో జరిగిన కెరీర్ గైడెన్స్ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మన ఆలోచనా విధానం సరిగా ఉంటే మానసిక రుగ్మతల కు చోటు ఉండదన్నారు. ప్రతి ఒక్కరూ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని సూచించారు. చెడు ఆలోచనలను దరికి రానివ్వవద్దని, మంచి ఆలోచనలతో ముందుకెళ్లాలని కోరారు. అనంతరం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివిధ మానసిక రుగ్మతలను, వాటి పరిష్కారాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్ర అధ్యక్షత వహించారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు డాక్టర్ సమాధానాలు చెప్పారు.

కూటమికి కాపు, బలిజ సామాజిక వర్గాల మద్దతు



మాట్లాడుతున్న గోపిశెట్టి నాగరాజు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 28 : టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి కాపు, బలిజ సామాజిక వర్గాలు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు జిల్లా బలిజ సంక్షేమ సంఘం నాయకుడు, అధ్యక్షుడు జి.నాగరాజు, గంధం ప్రసాద్, సురేష్‌బాబు పేర్కొన్నారు. గురువారం కడప నగరం హరితవర్స్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ కాపు, బలిజ సామాజిక వర్గాలన్నీ కూటమికే మద్దతునివ్వాలని స్పష్టం చేశారు. 2014లో ఈ కూటమిలోనే కాపులు లాభపడ్డారని, అలాగే అభివృద్ధి కూడా చెందినట్లు తెలిపారు. రాష్ట్రంలో తొలిసారి ఈ కూటమి ప్రభుత్వంలో కాపు, బలిజ, ఒంటరి కోసం కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసిన విషయం గుర్తు చేశారు. కాపు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. యువతకు చిన్న పరిశ్రమల ద్వారా ఉపాధి అవకాశాలు తెప్పించుకున్నారన్నారు. తొలిసారిగా కాపు విద్యార్థులను గుర్తించి విదేశీవిద్య అందించారన్నారు. అలాగే డ్రైవింగ్ నైపుణ్యం గల యువతకు కొత్త వాహనాలు అందించారన్నారు. కాపు రిజర్వేషన్ కమిషన్ ఏర్పాటు చేసి ఈడబ్ల్యుఎస్ కింద ఐదుశాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. ప్రతి జిల్లాకు 1 చొప్పున కాపు భవన్ నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారన్నారు. దాదాపు రూ.3వేల కోట్లు సబ్సిడీ కింద కాపులకు అందించారన్నారు. కావున కూటమికి కాపు, బలిజ, ఒంటరి సామాజిక వర్గం వారంతా మద్దతునివ్వాలని కోరారు.

వచ్చే ఎన్నికల్లో కూటమిదే విజయం



ఆత్మీయ సమావేశంలో పుత్తా నరసింహారెడ్డి తదితరులు

సీకేదిన్నె, మార్చి 28: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిదే విజయమని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం ఊటుకూరులో బీజేపీ నాయకుల ఆత్మీయ సమావేశం గురువారం కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్రమోహన్‌రెడ్డి నివాసంలో జరిగింది. ఈ సందర్భంగా పుత్తా నరసింహారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషన్‌రెడ్డి మాట్లాడుతూ కమలాపురం గెలుపుకోసం ఇరువురు కలిసి పనిచేసి నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో మెజార్టీ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. సర్వరాయసాగర్ ప్రాజెక్టు నీళ్ల మామ అల్లుళ్లే దోచుకుంటున్నారని రైతులకు ఎటువంటి ప్రయోజనం లేదని, దోపిడీని అరికట్టేందుకు అందరం కలిసి కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా అందరు కలిసికట్టుగా కృషి చేస్తామన్నారు. యువ నాయకులు పుత్తా చైతన్యరెడ్డి, టీడీపీ నాయకులు టక్కోలి వెంకటకృష్ణారెడ్డి, గంధం మోహన్‌బాబు, సుబ్బిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీను, గుర్రాల రెడ్డయ్య, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోసగారి ప్రభుత్వాన్ని గద్దెదింపుతాం

కమలాపురం రూరల్, మార్చి 28 : రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపి ఇంటికి సాగనంపాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని పుట్లంపల్లె, యానాదికాలనీ, ఇందిరమ్మకాలనీ తదితర ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృష్ణచైతన్యరెడ్డితో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్ బాషా, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ ఛైర్మన్ జంపాల నరసింహారెడ్డి, మండల కన్వీనరు రాఘవరెడ్డి, దివాకర్ రెడ్డి, కంకర సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, ధర్మారెడ్డి, వాసుదేవరెడ్డి, ఎల్లారెడ్డి, బోయిళ్ల శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వేడుకగా పాఠశాల వార్షికోత్సవం



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 28 : కడప నగరం 49వ డివిజను పరిధిలోని అలంఖాన్‌పల్లెలో గల ఉషోదయ స్కూలులో స్కూల్‌డే సెలబ్రేషన్స్ పాఠశాల కరస్పాండెంట్ కర్నాటి చెంచయ్య ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథులుగా ఏఐటీయూసీ నాయకులు నాగసుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, కార్యదర్శి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు చెడుదారి పట్టకుండా తల్లిదండ్రుల మాటవిని చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంసతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఓటింగ్‌లో పాల్గొనండి

చెన్నూరు, మార్చి 28 : ఎన్నికల వేళ ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఐ పార్థసారది అన్నారు. మండలంలోని ఉప్పరపల్లెలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని గురువారంరాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ ఎన్నికలు అతి దగ్గరకు వచ్చాయని, ఇలాంటి పరిస్థితుల్లో గ్రామంలోగొడవలు, ఘర్షణలకు తావు ఇవ్వకూడదని అన్నారు. ప్రజలకు అన్నిరకాల పోలీసుసిబ్బంది సహాయ సహకారాలు అందిస్తారు కాబట్టి ప్రశాంతంగా ఓట్లు వేసి ఎన్నికల్లో ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని కోరారు.

జగన్ బస్సు యాత్రకు స్పందన కరువు

● దళితులకు క్షమాపణ చెప్పాలి ● ఎన్డీయే కూటమి



విలేకరులతో మాట్లాడుతున్న ఎన్డీయే నాయకులు

వేంపల్లె, మార్చి 28: బస్సు యాత్ర పేరుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్వహిస్తున్న యాత్రకు స్పందన కరువైందని, గతంలో పాదయాత్రతో ప్రజలలో కలిసి ముద్దులు పెట్టిన జగన్ ఇపుడు ప్రజలకు దూరంగా ఏసీ బస్సులో వెళ్లడం ఏమిటని టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి ప్రశ్నించారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఎన్డీయే కూటమి నాయకులు టీడీపీ నాయకులు ఎస్‌బి జయరామిరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ దర్బార్, బీజేపీ మహిళా నాయకురాలు సుష్మ, సునీల్, జనసేన నాయకులు రామకృష్ణలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యాత్రలో జగన్ ప్రజలకు మేలు చేసే విషయం చెబుతారని ఆశపడి నిరాశచెందారన్నారు. ప్రజల్లోను, వైసీపీ కార్యకర్తల్లోను అసంతృప్తి కారణంగానే బస్సు యాత్ర తూతూమంత్రంగా సాగిందన్నారు. ఎంపీపీగా ఉన్న దళిత మహిళను బస్సులో ఎక్కించుకోకుండా అవమానం చేశారన్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు నందిపల్లె రామగంగిరెడ్డి, పాములూరు చంటి, మడక శ్రీనివాసులు, మండల ఉపాధ్యక్షులు భద్ర, మైనార్టీ నాయకులు మహమ్మద్, డక్కా రమేష్, నామా వేమకుమార్, గిడ్డంగివారిపల్లె సుధాకర్‌రెడ్డి, గణేష్‌నాయక్, బీజేపీ నాయకులు దొంతుసుమన్ తదితరులు పాల్గొన్నారు.

బద్వేలులో మన ఉమ్మడి అభ్యర్థి బొజ్జ రోశన్ననే

● సైకిలు, గ్లాసు ఓట్లన్నీ కమలం గుర్తుకు వెళ్లాలి ● మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీష్‌కుమార్‌రెడ్డి



బద్వేలులో సమావేశంలో మాట్లాడుతున్న రితీష్‌రెడ్డి

(కడప - ఆంధ్రజ్యోతి): పొత్తుల్లో భాగంగా బద్వేలు టికెట్‌ను బీజేపీకి కేటాయించారని, మన ఉమ్మడి అభ్యర్థి బొజ్జ రోశన్ననేనని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. వారు టీడీపీ నేతలతో వరుస సమావేశాలకు శ్రీకారం చుట్టారు. గురువారం వారు సమావేశాలు ఏర్పాటు చేసి కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పోరుమామిళ్లలో మైనార్టీలు, ఇతర నేతలతో సమావేశం ఏర్పాటు చేయగా ఆమె తనయుడు రితీష్‌రెడ్డి అట్లూరు, బద్వేలులో మీటింగ్ పెట్టారు. 'బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా రోశన్న పోటీ చేస్తున్నారు. ఈయనను గెలిపించుకోవడం మన బాధ్యత' అని పేర్కొన్నారు. సైకిలు గుర్తు, జనసేన గ్లాసు గుర్తు ఓట్లన్నీ బీజేపీ కమలం గుర్తుకు బదిలీ కావాలి. ఒక ఓటు కమలంకు, మరో ఓటు సైకిలు గుర్తుకు వేయండంటూ టీడీపీ శ్రేణులకు చెప్పడం, అలాగే జనసేన కేడరు అంతా ఈ సారి ఎన్నికల్లో ఒక ఓటు కమలం గుర్తుకు, మరో ఓటు సైకిలు గుర్తుకు వేసేలా చేయండంటూ కేడరుకు దిశనిర్దేశాలు ఇచ్చారు. గతంలో కూడా మైనార్టీ హక్కులకు ఎక్కడా బంగం కలగలేదని, వారి సంక్షేమం కోసం రంజాన్‌తోఫా, హజ్‌హౌస్ అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టిన విషయాన్ని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ గుర్తు చేశారు. మైనార్టీలకు కూటమి భరోసా ఉంటుందన్నారు. ఇక కలసపాడు, కాశినాయన, బికోడూరు, పోరుమామిళ్లలో నేడు, రేపు సమావేశం నిర్వహించి టీడీపీ జనసేన ఓటర్లను కమలం గుర్తుకు బదిలీ చేసేలా తల్లి కొడుకు విజయమ్మ, రితీష్‌రెడ్డి కార్యకర్తలను సిద్ధం చేస్తున్నారు.

బుధవ్ ప్లాస్టిక్ సర్జరీ హాస్పిటల్ ప్రారంభం



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ సోమశేఖర్ కుటుంబ సభ్యులు

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 28 : కడప నగరం ఆర్టీసీ బస్టాండు ఎదురుగా స్పెన్సర్స్ పక్కన బుధవ్ హాస్పిటల్‌ను మేనేజింగ్ డైరెక్టరు డాక్టర్ సోమశేఖర్, శిరీషా ప్రారంభించారు. గత ఎనిమిది సంవత్సరాలుగా జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించి నూతన భవనంలోకి మారారు. ఈ హాస్పిటల్‌లో ప్లాస్టిక్ సర్జరీలు, లేజర్, హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్, కాస్మటాలజీ తదితర వైద్యసేవలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎమ్మార్వో బోడిచెర్ల శ్రీనివాసులు, అవ్వారు వెంకటసుబ్బయ్య, ఆమంచి సాయిబాబా, హాస్పిటల్ సిబ్బంది కేశవ, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతకు నోటీసులు

పులివెందుల టౌన్, మార్చి 28: మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలను అతిక్రమించి అనుమతులు లేకుండా ర్యాలీ నిర్వహించిన నియోజకవర్గంలోని వేముల మండల వైసీపీ నాయకుడు వేల్పుల రాముకు నోటీసులు ఇచ్చారు. పులివెందుల ఆర్డీఓ, ఆర్‌ఓ నోటీసులు పంపారు. అనుమతులు లేకుండా బైకులు, ట్రాక్టర్లతో సుమారు 2000 మందితో ర్యాలీ నిర్వహించారని, నిబంధనలు అతిక్రమించినందుకు ఈ నోటీసులు అందించినట్లు కార్యాలయ అధికారులు పేర్కొన్నారు.

పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

కడప(రూరల్) మార్చి 28 : శిశు గృహంలోని పిల్లల ఆరోగ్యం పట్ల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. గురువారం కడప నగరం కొండాయపల్లెలోని శిశుగృహాన్ని జడ్జి విజిట్ చేశారు. ఈ సందర్భంగా గృహంలోని పిల్లల వివరాలను, వారికి అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ మాజీ కార్పొరేటర్లు



పార్టీలో చేరిన మాజీ కార్పొరేటర్లు చైతన్య, సురేష్

కడప(ఎర్రముక్కపల్లె), మార్చి 28: మదనపల్లెలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడి సమక్షంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్లు చైతన్య, సురేష్, 44వ డివిజన్ ఇన్‌చార్జ్ రాజశేఖర్, 20వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సోదరుడు కృష్ణ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

'హై సెక్యూరిటీ నంబరు ప్లేట్ల బాధ్యత షోరూం వారిదే'

సీకేదిన్నె, మార్చి 28: హైసెక్యూరిటీ నంబరు ప్లేట్లు వాహనాలకు బిగించాల్సిన బాధ్యత వాహనాలు అమ్మిన షోరూం వారిదేనని ఉపరవాణా కమిషనర్ మీరాప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఆర్టీఓ మురళి, మోటారు వాహన తనిఖీ అధికారులు విజయబాస్కర్, ప్రసాద్, లక్ష్మీప్రసన్న, వేణు, నారాయణనాయక్ ఆధ్వర్యంలో కడప, ప్రొద్దుటూరులోని షోరూంలలో హైసెక్యూరిటీ ప్లేట్ల అమలు చేస్తున్న తీరు పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న నంబరు ప్లేట్లను రేపటి సాయంత్రం కల్లా పూర్తి చేయాలని షోరూంలవారిని ఆదేశించినట్లు తెలిపారు.సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు నూతన వాహనాలకు హెచ్‌ఎస్‌ఆర్‌పీ నంబరు ప్లేట్లు బిగించాల్సిన బాధ్యత వాహనం అమ్మిన షోరూం వారికే ఉంటుందని, వాహనాలకు ఉన్న కస్టమర్లు వారి వద్ద ఉంచి హైసెక్యూరిటీ ప్లేట్లు బిగించుకోవాల్సిన అవసరం ఉంటుందన్నారు. ఈ నంబరు పేట్లు బిగించేందుకు షోరూం వారికి ఎటువంటి రుసుం అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. వాహనాలు కొనుగోలు చేసిన ప్రతి యజమాని తప్పనిసరిగా హైసెక్యూరిటీ నంబరు ప్లేట్లు షోరూం వారి వద్ద నుంచి పొందాలన్నారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

త్యాగానికి ప్రతిరూపం యేసు ప్రాణార్పణం

కడప (కల్చరల్), మార్చి 28: కల్వరి కొండ సిలువపై యేసుప్రభువు ప్రాణార్పణ చేయడం ఆయన త్యాగనిరతికి ప్రతిరూపమని తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, ఉమ్మడి రాష్ట్ర మైనార్టీ మాజీ అధ్యక్షుడు అమీర్‌బాబు కొనియాడారు. గురువారం స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని ఆరోగ్యమాత చర్చిలో టీడీపీలోని హిందూ-ముస్లిం-క్రైస్తవులతో కలిసి గుడ్‌ఫ్రైడేకు ముందస్తుగా స్తుతులు అర్పించి మాట్లాడారు. యేసుప్రభువు గొప్ప త్యాగధనుడు అన్నారు. టీడీపీ నాయకులు మేకల వెంకటేష్, నాసర్ అలీ, ఇమ్రాన్, ఐటీడీపీ నగర అధ్యక్షుడు వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూలుపై ఉన్న శ్రద్ధ సౌకర్యాలపై ఏదీ?: సీపీఐ

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 28 : పన్నుల వసూలుపై ఉన్న శ్రద్ధ సౌకర్యాలపై లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పేర్కొన్నారు. పాలక ప్రభుత్వాలు ఎన్నికల ముందు తాము అధికారంలోకి రాగానే నీటిపారుదల ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేసి ప్రతి గ్రామానికి తాగునీరు అందిస్తామని, కడప నగరంలో 24గంటలు నీళ్లందిస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చి ఐదు సంవత్సరాలు పూర్తవుతున్నా వాగ్దానాలు అమలు కావడంలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర అన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలో ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని ఇసుక మేటల కోసం దిగువకు వదిలేశారన్నారు. నిబంధనలకు పాత్ర వేసి అధికారాన్ని అడ్డం పెట్టుకుని అధికార పార్టీ నేతలు అడ్డగోలుగా ఇసుకను అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. ఇసుక తవ్వకాల వల్ల భూగర్భజలాలు గణనీయంగా పడిపోతున్నాయని చాలా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి మొదలైందని ప్రత్యామ్నాయమార్గాలపై అధికారులు చర్యలు ముమ్మరం చేయాలని, కడప లాంటి నగరంలో వారానికి ఒక సారి కూడా తాగునీరు ఇవ్వలేని స్థితి నెలకొందని అన్నారు. ప్రజల నుండి పన్నుల రూపంలో పీల్చి పిప్పి చేస్తున్న పాలకవర్గాలు ప్రజల అవసరాలు తీర్చడంలో తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు.

ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 28: బొల్లవరంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.4,73,700 ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ గోన ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం ఆలయంలో 206 రోజులకు భక్తులు స్వామివారికి సమర్పించిన కానుకలను లెక్కించారు. కార్యక్రమంలో ఈవోలు రామచంద్రాచార్యులు, జగన్‌మోహన్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు రామకృష్ణారెడ్డి, రాజశేఖర్, మురళీకృష్ణయాదవ్, కేవీ చలపతి, శివరామిరెడ్డి, అర్చకులు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

4న సేద్యపు ఎద్దుల బండలాగుడు పోటీలు

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 28: గుడ్‌ఫ్రైడే, ఈస్టర్‌డే సందర్భంగా ఏప్రిల్ 1వ తేదీ సోమవారం కల్లూరులో సేద్యపు ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రైస్తవ యువజన సంఘం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వృషభరాజములకు మొదటి బహుమతి రూ.30 వేలు, రెండవ బహుమతి రూ.20 వేలు, మూడవ బహుమతి రూ.10 వేలు, నాలుగో బహుమతి రూ.5 వేలు, అయిదవ బహుమతి రూ.3 వేలు అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు కమిటీ పెద్దల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. బండలాగుడు పోటీల సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. వివరాలకు 9704796767 నంబరులో సంప్రదించాలని కోరారు.

ప్రొద్దుటూరుకు జగన్ ప్రభుత్వం చేసిందేమీ లేదు

● రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర కన్వీనర్

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 28: వైసీపీ పాలనలో ప్రొద్దుటూరుకు ఒరిగిందేమీ లేదని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎస్.ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. 2019 ఎన్నికల సందర్భంగా పుట్టపర్తి సెంటర్‌లో జరిగిన సమావేశంలో పాలఫ్యాక్టరీని పునరుద్ధరించి మెడికల్ కళాశాలను ఏర్పాటు చేస్తామని, ప్రొద్దుటూరును జిల్లా చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ అయిదేళ్లలో ప్రొద్దుటూరుకు ఇచ్చిన హామీలు నెరవేరలేదన్నారు. సిద్ధం బహిరంగ సభలో హామీల గురించి మాట మాత్రంగానైనా చెప్పకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనారాయలసీమ జిల్లాల్లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రాయలసీమ అభివృద్ధికి తీసుకునే పథకాల గురించి ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఆర్యవైశ్య జిల్లా సంఘంలో మైదుకూరు వాసులకు చోటు

మైదుకూరు, మార్చి 28: జిల్లా ఆర్యవైశ్య సంఘం రూరల్ నూతన కమిటీలో పలువురు మైదుకూరు వాసులకు చోటు దక్కింది. జిల్లా ఉపాధ్యక్షుడిగా నూరిశెట్టి శివ వెంకటప్రసాద్ గుప్త, వర్కింగ్ ప్రెసి డెంట్‌గా యెలిశెట్టి వెంకట గురుప్రసాద్, సెక్రటరీగా డి.సునీల్, మండ ల యువజన సంఘం అధ్యక్షుడిగా జి.మధు, మండల సేవాదళ్ అధ్య క్షుడిగా ఎ.సురేంద్ర, మండల సంఘం అధ్యక్షులుగా కె.రామక్రిష్ణ, మహిళా మండలి అధ్యక్షురాలిగా ఎం.పద్మజ, ఈసీ సభ్యులుగా రత్నం, సురేష్‌బాబు, సతీష్, ఆంజనేయులు, కళ్యాణ్, గోపాల్‌లకు జిల్లా కమిటీలో స్థానం లభించింది.

15 లీటర్ల నాటుసారా స్వాధీనం

కాశినాయన మార్చి 28: మండలంలోని బాలాయపల్లె సమీపంలోని అటవీ ప్రాంతంలో గురువారం అక్రమంగా నాటుసారా కాస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి.. 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. గత కొంతకాలంగా నాటుసారాపై ప్రత్యేక నిఘాపెట్టి గాలింపు చర్యలు చేపట్టగా గొంటువారిపల్లెకు చెంది న వేముల కోట ఖాదరయ్య, బాలాయపల్లెకు చెందిన పెను బాడి వెంకటయ్యలు సారా కాస్తుండగా అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని 200 బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు.

సిద్ధం సభలకు ఆర్టీసీ బస్సులు

● బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు ● జమ్మలమడుగులో గంటల తరబడి పడిగాపులు





జమ్మలమడుగు పాత బస్టాండు వద్ద బస్సు రాగానే ఎగబడుతున్న ప్రయాణికులు, తాడిపత్రి బస్టాపు వద్ద పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

జమ్మలమడుగు, మార్చి 28: జమ్మలమడుగులో గత రెండు రోజుల నుంచి ఆర్టీసీ బస్సులు లేక ప్రయాణికులు కష్టాలు పడుతున్నారు. 27వ తేదీ పలు ప్రాంతాల ఆర్టీసీ డిపోల నుంచి జమ్మలమడుగు, ప్రొద్దుటూరు వైసీపీ సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులను వాడుకున్నారు. దీంతో జమ్మలమడుగు పట్టణంలోని పాత బస్టాండులో నాన్‌స్టాప్ సర్వీసులు వేళకు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంతేకాక కడప, రాజంపేట, తిరుపతి, హైదరాబాదు, బెంగుళూరు తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడ్డారు. గురువారం మధ్యాహ్నం జమ్మలమడుగు బస్టాపు వద్ద ప్రయాణికులు గంటల తరబడి బస్సుల కోసం ఎదురు చూపులు చూడాల్సి వచ్చింది. ఈ సందర్భంగా కొందరు ప్రయాణికులు వైసీపీ సిద్ధం సభలకు ఆర్టీసీ బస్సులను తరలించడం పట్ల ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అద్దె బస్సులు తీసుకోకుండా కేవలం ఆర్టీసీ బస్సులనే వాడుకుని ప్రయాణికులను ఇబ్బంది కలిగించడం దారుణమన్నారు. జమ్మలమడుగు నుంచి తాడిపత్రి, కోవెలకుంట్ల, కర్నూలు, బనగానపల్లె, ఆళ్లగడ్డ, నంద్యాల, తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులే కాక జమ్మలమడుగు నియోజకవర్గంలోని వద్దిరాల, పెద్దముడియం ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జమ్మలమడుగు డిపో నుంచి నంద్యాల సిద్ధం సభకు సుమారు 25 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయం జమ్మలమడుగు ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ పెద్దిరాజుకు తెలుపగా తమ డిపో నుంచి 25 బస్సులు నంద్యాలకు వెళ్లాయని తెలిపారు. ప్రైవేటు అద్దె బస్సులు (హయ్యర్) ఎందుకు తీసుకెళ్లలేదని అడుగగా తనకు తెలియదన్నారు.

పాలీసెట్‌పై ఉచిత శిక్షణ

మైదుకూరు, మార్చి 28: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ ప్రవేశ పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ గురుమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదవ తరగతి పరీక్షల తరువాత పాలిటెక్నిక్ చదివితే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, అనుభవం కలిగిన అధ్యాపకులచే సోమవారం నుంచి ఏప్రిల్ 25 వరకు కళాశాలలో ఉచిత కోచింగ్‌తో పాటు మెటీరియల్ కూడా ఇస్తామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

డబ్బులు తీసుకొని మోసం చేశారని ఫిర్యాదు

మైదుకూరు రూరల్ మార్చి 28: విజయవాడకు చెంది న ఎం.భాస్కర్ కుమార్ అనే వ్యక్తి తమ వద్ద డబ్బులు తీసుకొని మోసం చేశాడని శ్రీనివాసులు, ఖాజాపీర్‌లు గురువారం మైదుకూరు ఎస్‌ఐ ఘన మద్దిలేటికి ఫిర్యాదు చేశారు. శ్రీనివాసులు, ఖాజాపీర్ వద్ద నుంచి సుమారు ఆరు లక్షల యనభైవేల రూపాయలు తీసు కొని డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నాడని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎస్‌ఐ మద్దిలేటి విచారించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

నిర్భయంగా ఓటు వేయాలి

ఖాజీపేట, మార్చి 28: ప్రజల అవసరాలను గుర్తించే ప్రజాస్వామ్యం కావాలంటే మన ఓటును అమ్ముకోకుండా నిర్భయంగా వేయాలని తహసీల్దారు వెంకటలక్ష్మి అన్నారు. గురువారం సాహిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఎస్‌వీఈఈపీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగకుండా మంచి నాయకున్ని ఎన్నుకునేందుకు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. అర్హులై ఉండి ఓటు హక్కు లేనివారు 14వ తేదీ లోపు నమోదు చేసుకోవాలన్నారు.

విద్యార్థులు సాంకేతికతపై పట్టు సాధించాలి



రోడ్డు భద్రతపై రూపొందించిన ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 28: ఇంజనీరింగ్ విద్యార్థులు సాంకేతికతపై పట్టు సాధించాలని ఆర్‌అండ్‌బీ సూపరింటెండెంట్ మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం వైఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్మానిక-2024 సాంకేతిక సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పేపర్ ప్రజంటేషన్, టెక్నికల్ క్విజ్, పోస్టల్ ప్రజంటేషన్, మోడల్‌మేకింగ్, టెక్నోఆంటో వంటి అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జరిగే సాంకేతిక మార్పులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పశ్చిమ బెంగాల్‌లో భూగర్భ రైల్వేలైన్ నిర్మాణం చేయడం సివిల్ ఇంజనీరింగ్‌లో అద్భుతమైన ప్రగతికి నిదర్శనమన్నారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.నాగరాజు మాట్లాడుతూ కాంక్రీట్‌లోని పగుళ్లను బ్యాక్టీరియాతో తగ్గించడానికి జీయోపాలిమర్స్‌ను అభివృద్ధి చేయడం సాంకేతిక నైపుణ్యానికి నిదర్శనమన్నారు. సివిల్ విభాగం హెచ్‌వోడీ ప్రొఫెసర్ జయరామిరెడ్డి మాట్లాడుతూ ఇటువంటి సెమినార్ల వలన విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయవచ్చునన్నారు. అనంతరం వివిధ అంశాలలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్‌జైలును తనిఖీ చేసిన జడ్జి

జమ్మలమడుగు, మార్చి 28: జమ్మలమడుగు సబ్‌జైలును జడ్జి ఎస్.భార్గవి తనిఖీ చేశారు. గురువారం మధ్యాహ్నం సబ్‌జైలులో తనిఖీ చేసి రిమాండ్ ఖైదీల సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడారు. లోక్ అదాలత్, ప్రమాదాల కేసులు తదితర వాటికి సంబంధించి ఖైదీలకు వివరించారు. న్యాయవాదులు సుబ్బారావు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కొండాపురం, మార్చి 28 : మండలంలోని దొబ్బుడుపల్లె గ్రామం సమీపంలో గురువారం పోలీసులు 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.నాటుసార ను కాచడానికి ఉపయోగించే ఈ బెల్లం ఊటను తమ సిబ్బంది శివ, నరసింహ సహాయంతో ధ్వంసం చేశామని తాళ్లప్రొద్దుటూరు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. కాగా దీని తయారీదారుల కోసం గాలిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

30 మద్యం బాటిళ్లు స్వాధీనం

పోరుమామిళ్ల, మార్చి 28: ప్రభుత్వ అనుమతి లేకుండా మద్యం బాటిళ్లు తీసుకెళతున్న వ్యక్తిని అరెస్టు చేసి.. 30 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చిరంజీవి, ఎస్‌ఐ మల్లిఖార్జునరెడ్డి తెలిపారు. గురువారం పోరుమామిళ్ల సమీపంలోని మల్లకతవ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బి.కోడూరు మండలం తువ్వపల్లెకు చెందిన వీరయ్య అనే వ్యక్తి 30 మద్యం బాటిళ్లు తీసుకెళుతుండగా స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రత పాటించాలి

ఖాజీపేట, మార్చి 28: ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే వ్యాధులు రావని డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా స్టేట్‌ప్రోగ్రాం మేనేజర్ కుమారి అన్నారు. గురువారం కస్తూర్బాగాంధీ విద్యాలయంలో డెటాల్ స్కూల్ హైజీన్ ఎడ్యుకేషన్‌లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనం శుభ్రంగా ఉన్నామని అనుకున్నా వేలాది క్రిములు ఉంటాయని, కనీసం 20 సెకన్లపాటు వాష్ ద్రావణంతో చేతులు కడుక్కోవడం వలన శుభ్రం అవుతుందన్నారు.

ఘనంగా నంద్యాల కొండారెడ్డి పుట్టినరోజువేడుకలు



పుట్టిన రోజు వేడుకల్లో కేక్‌కట్ చేస్తున్న కొండారెడ్డి

ప్రొద్దుటూరు / ప్రొద్దుటూరు టౌన్, మార్చి 28: టీడీపీ నాయకుడు మాజీ ఎమ్మెల్యే నంద్యాల వదరరాజు లరెడ్డి కుమారుడు నంద్యాల కొండారెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక నెహ్రూ రోడ్డులోని టీడీపీ ఎన్నికల క్యాంపు ఆవరణలో కొండారెడ్డి కేక్‌కట్ చేశారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కొండారెడ్డికి కేక్ తినిపించారు. టీడీపీ కార్యాకర్తలు పెద్దఎత్తున కొండారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నేతలు మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు, బచ్చల పుల్లయ్య, ఆసం రఘురామిరెడ్డి బచ్చలప్రతాప్, నారాయణరెడ్డి, కౌన్సిలరు మహ్మద్‌గౌస్. మాజీ కౌన్సిలర్ గంజికుంట ఆంజనేయులు, తలారి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నందమూరి యువసేవా సమితి ఆధ్వర్యంలో : తెలుగుదేశం పార్టీ యువనాయకులు నంద్యాల కొండారెడ్డి జన్మదిన వేడుకలను నందమూరి యువసేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కొండారెడ్డిని ఘనంగా సత్కరించి కేక్ కట్‌చేయించి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నందమూరి యువసేవా సమితి అధ్యక్షుడు గోమేదికం సుదర్శన్ మాట్లాడుతూ కొండారెడ్డి భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురప్పయాదవ్, తెలుగుయువత జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రామూనాయుడు, సీబీఎన్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటసుబ్బయ్య, కోనేటి ఓబుళరెడ్డి, మచ్చా నాగభూషణం, సురేష్‌కుమార్, సిజె సమర తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు



వరదరాజులరెడ్డి, సురేష్ నాయుడు ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

ప్రొద్దుటూరు, మార్చి 28: వైసీపీ నుంచి టీడీపీకి వలసల పర్వం కొనసాగుతూనే ఉంటుందని.. ప్రొద్దుటూరులో వైసీపీ ఖాళీ అయ్యి.. ఎమ్మెల్యే ఆయన కుటుంబ సభ్యులే మిగిలే రోజులు దగ్గరపడనున్నాయని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక బంగారయ్య కొట్టాలలో వైసీపీ నేతలు చిలకల క్రిష్ణారెడ్డి, బద్వేలు వాసులతో పాటు 100 కుటుంబాలు టీడీపీలో చేరాయి. మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సురేస్‌నాయుడులు వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ లక్ష్మిరెడ్డి, ఈశ్వరరెడ్డి, బాలిరెడ్డి, బాలప్ప , సుబ్బరామిరెడ్డి, నిశాంత్ సుబ్బరాయుడులు పాల్గొన్నారు.

50 కుటుంబాలు టీడీపీలో చేరిక

మైదుకూరు రూరల్ మార్చి 28: మండలంలోని సుంకులగారిపల్లె గ్రామంలో గురువారం వైసీపీ నాయకులు మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో టీడీపీలో చేరారు. పుట్టా వారికి పార్టీ కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అంబటి శివశంకర్‌రెడ్డి, అంబటి శంకర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, జయరామిరెడ్డి, పాలెంరెడ్డి చిన్నపరెడ్డి, పాలెంరెడ్డి నాగేంద్రరెడ్డి, గంగాధర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డిలతో పాటు వారి అనుచరులు 50 కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలో పుట్టాను మంచి మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు భీమయ్య, మల్లిఖార్జున్ యాదవ్, రామచంద్రనాయుడు, సర్పంచ్ నారాయణ, కిషోర్, నేట్లపల్లి సుబ్బరాయుడు, శివ, నాగమోహన్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

పలుగురాళ్లపల్లెలో 40 కుటుంబాలు...



పుట్టా సమక్షంలో టీడీపీలో చేరిన పలుగురాళ్లపల్లె గ్రామ ప్రజలు

బ్రహ్మంగారిమఠం, మార్చి 28: మండలంలోని పలుగురాళ్ల పల్లె గ్రామానికి చెందిన వైసీపీ నేత కొరపాటి ప్రభాకర్‌రావు (రిటైర్డ్ వార్డెన్) ఆధ్వర్యంలో వీరయ్య, గురయ్య, బాలుడు, ఓబయ్య, శ్రీను, బ్రహ్మయ్యతో పాటు వారి అనుచర వర్గం సుమారు 40 కుటుంబాల వారు గురువారం మైదుకూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఒకసారి అవకాశం ఇస్తే తన సొంత పంచాయతీ అయిన పలుగురాళ్లపల్లె పంచాయతీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం ఓసీ, ఎస్సీ కాలనీల్లో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం చేపట్టి టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేసే పథకాలపై ప్రజలకు వివరించారు. బి.మఠం మండల టీడీపీ నేతలు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, కుంచాల వివేకానంద రెడ్డి, పుట్టా ప్రభాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా సాగిన బండలాగుడు పోటీలు

పెద్దముడియం, మార్చి 28: మండల పరిధిలోని పెద్దపసు పుల గ్రామంలో శ్రీమాధవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగం గా గురువారం న్యూకేటగిరి విభాగానికి సంబంధించి వృష భరాజములకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 వరకు రెండు విడతలుగా జరిగిన బండలాగుడు పోటీల్లో 13 జతల వృషభజరాములు పాల్గొన్నాయి. పోటీలు ఆద్యంతం ఉత్కంఠ భరితంగా జరిగాయి. పోటీల్లో జమ్మలమడుగుకు చెందిన బీరంబుల్స్ ఎడ్లు మొదటిబహుమతి, రంగసాయి పల్లెకు చెందిన మార్తల వెంకట సుబ్బారెడ్డి వృషభాలు రెండో బహుమతి, జమ్మలమడుగుకు చెందిన బీరంబుల్స్ మూడో బహుమతి గెలుపొందాయి. పోటీల్లో పాల్గొన్న అన్ని జతలకు అలయ నిర్వాహకులు బహుమతులు అందించారు. ఎస్‌ఐ రామక్రిష్ణ బందోబస్తు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన ఎడ్ల జతల యజమానులకు ఆలయ చైర్మన్ శ్రీనివాసరెడ్డి బహుమతులు అందించారు.

న్యాయవాదుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 28: ప్రొద్దుటూరు న్యాయవాదుల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సి.సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు మల్లెల లక్ష్మీప్రసన్న, కార్యదర్శిగా కె.గురప్ప, కోశాధికారిగా ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా ఎం.రమేష్‌బాబు, మహిళా కార్యదర్శిగా ఎం.షెహనాజ్‌లను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం సంవత్సరం పాటు పదవిలో కొనసాగనుంది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో న్యాయవాదులు దాదాపీర్, ఎం.సుధాకర్‌రెడ్డి, పి.జిలానీబాష, ఎం.కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరులో నూతన కమిటీ ఏర్పాటు

మైదుకూరు, మార్చి 28: మైదుకూరు బార్ అసోషియేషన్‌కు నూతన కమిటీని గురువారం ఏన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.బాల వెంకటయ్య, జనరల్ సెక్రటరీగా కొట్టే జయరాం, జాయింట్ సెక్రటరీగా సోమేసుల యశ్వంత్, మహిళా జాయింట్ సెక్రటరీగా సోమేసుల సుచిత్రలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు న్యాయవాదులు పేర్కొన్నారు.

‘చేతివృత్తిదారుల పట్ల నిర్లక్ష్యం తగదు’

బద్వేలు, మార్చి 28: చేతివృత్తి దారుల పట్ల కేంద్ర, రాష్ట ప్రభుత్వాల తీరు తగదని, వారికి ప్రభుత్వాలు తీరని ద్రోహం చేశాయని ఏపీ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ కన్వీనర్ మన్నూరు భాస్కరయ్య తెలిపారు. గురువారం సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేతివృత్తులలో అనేక మార్పులు వచ్చి టెక్నాలజీ రూపంలో అధునాతన యంత్రాలు వచ్చినప్పటికీ ఆర్థిక ఇబ్బందుల కారణంగా పాత పద్ధతులను కొనసాగించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వాలు ఆర్థిక సహాయం అందించకపోగా పైపెచ్చు కార్పోరేట్ల కోసం అనేక రాయితీలు ప్రకటిస్తున్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వం 56 కార్పొరేషన్ల ద్వారా మేలు చేస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకపోవడం దారుణమన్నారు. అలాగే ఆయా కార్పోరేషన్లకు 56 మంది చైర్మన్‌లకు లక్షల రూపాయల గౌరవ వేతనం చెల్లించి ప్రజాధనం వృథా చేస్తున్నారన్నారు. జరగబోయే సార్వత్రిక ఎన్నికలలో బీసీలు, చేతి వృత్తిదారులు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో సుబ్బయ్య, బాలయ్య, విజయమ్మ పాల్గొన్నారు.

బద్వేలులో మన ఉమ్మడి అభ్యర్థి బొజ్జ రోశన్ననే

● సైకిలు, గ్లాసు ఓట్లన్నీ కమలం గుర్తుకు వెళ్లాలి ● మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీష్‌కుమార్‌రెడ్డి



బద్వేలులో టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రితీష్‌రెడ్డి, చిత్రంలో విజయమ్మ, రోశన్న

(కడప - ఆంధ్రజ్యోతి): పొత్తుల్లో భాగంగా బద్వేలు టికెట్‌ను బీజేపీకి కేటాయించారని, మన ఉమ్మడి అభ్యర్థి బొజ్జ రోశన్ననేనని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీష్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. వారు టీడీపీ నేతలతో వరుస సమావేశాలకు శ్రీకారం చుట్టారు. గురువారం వారు సమావేశాలు ఏర్పాటు చేసి కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పోరుమామిళ్లలో మైనార్టీలు, ఇతర నేతలతో సమావేశం ఏర్పాటు చేయగా ఆమె తనయుడు రితీష్‌రెడ్డి అట్లూరు, బద్వేలులో మీటింగ్ పెట్టారు. ‘బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా రోశన్న పోటీ చేస్తున్నారు. ఈయనను గెలిపించుకోవడం మన బాధ్యత’ అని పేర్కొన్నారు. సైకిలు గుర్తు, జనసేన గ్లాసు గుర్తు ఓట్లన్నీ బీజేపీ కమలం గుర్తుకు బదిలీ కావాలి. ఒక ఓటు కమలంకు, మరో ఓటు సైకిలు గుర్తుకు వేయండంటూ టీడీపీ శ్రేణులకు చెప్పడం, అలాగే జనసేన కేడరు అంతా ఈ సారి ఎన్నికల్లో ఒక ఓటు కమలం గుర్తుకు, మరో ఓటు సైకిలు గుర్తుకు వేసేలా చేయండంటూ కేడరుకు దిశనిర్దేశాలు ఇచ్చారు. గతంలో కూడా మైనార్టీ హక్కులకు ఎక్కడా బంగం కలగలేదని, వారి సంక్షేమం కోసం రంజాన్‌తోఫా, హజ్‌హౌస్ అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టిన విషయాన్ని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ గుర్తు చేశారు. మైనార్టీలకు కూటమి భరోసా ఉంటుందన్నారు. ఇక కలసపాడు, కాశినాయన, బికోడూరు, పోరుమామిళ్లలో నేడు, రేపు సమావేశం నిర్వహించి టీడీపీ జనసేన ఓటర్లను కమలం గుర్తుకు బదిలీ చేసేలా తల్లి కొడుకు విజయమ్మ, రితీష్‌రెడ్డి కార్యకర్తలను సిద్ధం చేస్తున్నారు.